# యాత్ర ఇతర జిల్లాలకు స్ఫూర్తి..

## మీ ఆరోగ్యం జాగ్రత్త

## నామాకు అధినేత బాబు ఫోన్



జిల్లాలో కొనసాగుతోన్న సైకిల్ యాత్రపై, తెదేపా రాష్ట్ర నేత నామా నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం ఆరా తీశారు. సైకిల్ యాత్ర ఎలా సాగుతోందో అడిగి తెలుసుకున్నారు. యాత్ర ఆదివారం బయ్యారంలో సాగుతుండగా నామా నాగేశ్వరరావుకు చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. తొలుత ఆరోగ్యం గురించి ప్రశ్నించారు. గత రెండు రోజులుగా తీవ్రమైన మోకాళ్లు, గొంతు నొప్పితో నామా బాధ పడుతున్నారు. దీనిపై చంద్రబాబు స్పందించారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సూచించారు. జిల్లాలో సైకిల్ యాత్రకు వస్తోన్న స్పందన, కార్యకర్తల ఉత్సాహం, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం ఎలా సాగుతోందనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కిలోమీటర్లు, ఎన్ని గ్రామాల గుండా యాత్ర సాగిందన్న వివరాలపై ఆరా తీశారు. యాత్ర రూపకల్పన, నిర్వహణ మంచి కార్యక్రమమని ఖమ్మం జిల్లాను ఇతర జిల్లాలు స్ఫూర్తిగా తీసుకునే విధంగా రాష్ట్ర స్థాయిలో ప్రయత్నించనున్నట్లు బాబు పేర్కొన్నారు. బహిరంగ సభకు ఏర్పాట్లు విషయంపై చర్చించారు. జిల్లాలో యాత్రకు వస్తోన్న స్పందన, జిల్లా పార్టీ ఆధ్వర్యంలో యాత్ర సాగుతోన్న తీరు తదితర వివరాలను బాబుకు నామా వివరించారు.

–ఖమ్మం రూరల్, న్యూస్‌టుడే